నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

డిజిటల్ కార్డు డేటా ఎంట్రీ సక్రమంగా చేపట్టాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, అక్టోబర్ 8 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు డేటా ఎంట్రీ నమోదు విషయంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా సక్రమంగా సమాచారాన్ని అన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్, కౌడిపల్లి తహసీల్దార్ ఆంజనేయులు, శివంపేట్ ఎంపీడీవో నాగేశ్వర్‌రావు, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ రావు, తదితరులు ఉన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

శివ్వంపేట, అక్టోబర్ 8: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న ఘటన శివ్వంపేట మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం జిల్లా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొంతాన్‌పల్లి గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి రైస్ మిల్లు సమీపంలో సోమవారం అర్ధరాత్రి అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. ఒక మినీ డీసీఎం, త్రీ వీలర్ ఆటోలో దాదాపు 84 బియ్యం బస్తాలు ఉన్నాయని, ఆ రెండు వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వచ్చిన రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తే అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆమె తెలిపారు. అడిషనల్ సివిల్ సప్లై అధికారి ద్రోణాచార్యులు, సివిల్ సప్లై తహసీల్దార్ ప్రభాకర్, స్థానిక ఎస్సై మహిపాల్ రెడ్డి, సివిల్ సప్లై సిబ్బంది వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

శివ్వంపేట, అక్టోబర్ 8 : ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మంగళవారం శివ్వంపేట రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో స్వల్పకాలికంగా ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా రైతు ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా ఆయిల్‌పామ్ సాగుతోనే సాధ్యమని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ పంట సాగు చేపట్టాలని తెలిపారు. సదస్సులో మండల వ్యవసాయ అధికారి లావణ్య, లీవ్ ఫామ్ రిసోర్సెస్ కంపెనీ ప్రతినిధి శ్రీ కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నర్సాపూర్, అక్టోబర్ 8 : నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ మెదక్ టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన కౌన్సిలర్ సంఘసాని సురేశ్‌ని మున్సిపల్ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజేందర్, యాదగిరి, మేనేజర్ మధుసూదన్, రాంచందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భూపాల్, వార్డు అధికారులు రాములు, దుర్గయ్య, నాయకులు నగేశ్, బాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

ప్రమోషన్ పొందిన ఈవోకు సన్మానం

శివ్వంపేట, అక్టోబర్ 8 : శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ థర్డ్ గ్రేడ్ ఈవోగా ప్రమోషన్ లభించింది. మంగళవారం దేవాలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, ఆలయ ఈవో సారా శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. విధుల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో దేవాలయ ప్రధాన పూజారి దేవదత్తుశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస్ ను సన్మానిస్తున్న ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, ఈ వో సారా శ్రీనివాస్

తాళం వేసిన ఇంట్లో చోరీ.. నగలు అపహరణ

వెల్దుర్తి, అక్టోబర్ 8 : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నాలుగున్నర తులాల బంగారు నగలు, 20 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మంగళి సాయికుమార్ సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి దూరంగా ఉన్న పాత ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి నిద్రించారు. తాళం వేసిన ఇంటిని గమనించిన గుర్తు తెలియని దొంగలు బీరువాను ధ్వంసం చేసి నాలుగున్నర తులాల బంగారు నగలు, 20 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం సాయికుమార్ ఇంటికి వెళ్లి చూడగా చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాజు ఇంటిని, బీరువాను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

కౌడిపల్లి, అక్టోబర్ 8 : బైకు అదుపు తప్పి ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముండి తండా శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్ మండల్ సోమక్కపేట గ్రామానికి చెందిన చీమల లక్ష్మయ్య (49) గండిమైసమ్మ నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, దవాఖాన కుతరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సింగల్‌ఫేస్ మోటర్ అందజేత

శివ్వంపేట, అక్టోబర్ 8 : శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామంలో గ్రామ ప్రజలకు మండల పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరాంరెడ్డి రూ. 30వేల సొంత ఖర్చులతో సింగల్‌ఫేస్ మోటర్‌ను గ్రామస్తులకు అందజేశారు. నీటి సమస్య ఉందని చెప్పడంతో వెంటనే స్పందించిన వెంకటరాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 8 : హైదరాబాద్‌లో జరుగుతున్న 35వ రాష్ట్ర పీఆర్టీయూ కౌన్సిల్ సమావేశంలో మెదక్ పట్టణానికి చెందిన మల్లారెడ్డి మూడోసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పక్కాగా ధాన్యం సేకరించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : వానకాలం 2024- 25 సీజన్ సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సక్రమంగా చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్‌హాల్లో వానకాలం (ఖరీఫ్) 2024- 25 సీజన్ వరి ధాన్యం (సన్నరకం, దొడ్డు రకం) కొనుగోలుపై ఏఈఓలు, డీపీఎంలు, ఏపీఎంలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఫ్యాక్స్, ఐకేపీ, మార్కెటింగ్, శాఖల ద్వారా 463 కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు ఐకేపీ ద్వారా 160 కొనుగోలు కేంద్రాలు, ఫ్యాక్స్ ద్వారా (284) , డీఎం సివిల్ సప్లై 07, ఎఫ్‌పీవో 12 కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏ కేంద్రంలో అయినా ఈ సన్నాలకు రూ. 500 బోనస్ పట్ల అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సి విల్ సప్లయ్ అధికారులు, డీఎం సివిల్ సప్ల య్ హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్ రెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, డీసీవో కరుణ, మార్కెటింగ్, రవాణా, సంబంధిత అధికారులు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మెదక్ మున్సిపాలిటీ : మెదక్‌లో మహాలక్ష్మి రూపంలో కాళీమాతకు రూ. 16 లక్షల కరెన్సీతో అలంకరణ

నిజాంపేట : నిజాంపేట హనుమాన్ ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చిలిపిచెడ్ : చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుట్టున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట: బగలాముఖీ శక్తి పీఠంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

ఘనంగా పూజలు

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళ వారం అమ్మవారికి కుంకుమార్చనలు, నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.
-మెదక్ జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ,అక్టోబర్ 8

మనోహరాబాద్: దుర్గాదేవి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

చేగుంటలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళ భక్తులు

వెల్దుర్తి : దుర్గాదేవిని దర్శించుకున్న పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి

రామాయంపేట : రామాయంపేట పట్టణంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన మహంకాళి అమ్మవారు

చిన్నశంకరంపేట : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వాములు

పాపన్నపేట: గోకుల్‌షెడ్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సంబురాలు

చాంపియన్‌గా మెదక్ జిల్లా

చాంపియన్‌గా నిలిచిన మెదక్ జిల్లా జట్టుకు కప్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలోని ఔట్‌డోర్ స్టేడియం, వెస్లీ స్కూల్ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఫ్ 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నిలిచింది. 6,7వ తేదీల్లో లీగ్ దశల్లో మ్యాచ్‌లు నిర్వహించగా, సెమీఫైనల్‌కు ఉమ్మడి జిల్లాలైన మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్‌లో రంగారెడ్డి, నిజామాబాద్ జట్లు తలపడగా రంగారెడ్డి జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. మరో సెమీఫైనల్‌లో ఆదిలాబాద్, మెదక్ జిల్లా జట్లు తలపడగా మెదక్ జిల్లా విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం నిర్వహించిన ఫైనల్ పోటీలో మెదక్ జిల్లా, రంగారెడ్డి జిల్లా జట్ల మధ్య పోటీ హోరాహోరీగా కొనసాగింది. రంగారెడ్డి జిల్లా ఒక గోల్ సాధించగా మెదక్ జిల్లా జట్టు రెండు గోల్స్ సాధించి విజయం సాధించి రాష్ట్ర చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తృతీయ స్థానంలో నిజామాబాద్ జిల్లా, నాలుగో స్థానంలో ఆదిలాబాద్ జిల్లాలు నిలిచాయి. మెదక్ జిల్లా జట్టులో చైతన్యశ్రీ మంచి ప్రతిభ కనబరిచి విజయంలో కీలక పాత్ర పోషించింది.

స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

పట్టదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్‌జీఫ్ 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలతో పాటు కప్‌లు అందజేశారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, టోర్నమెంట్ కో -ఆర్డినేటర్ నాగరాజు, వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వ్యాయమ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రావు, దేవేందర్‌రెడ్డి, మహిపాల్, రూపేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలి

మెదక్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుండయ్య, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, సత్యనారాయణ మాట్లాడుతూ మెదక్ జిల్లా కౌడిపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ ఓరల్ పర్మిషన్ తీసుకొని వెళ్లిన సూపర్‌వైజర్లు, హెచ్ ఈవో సస్పెషన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఏ శాఖలో లేని విధంగా సస్పెషన్లను వైద్య శాఖలో చేయడం భావ్యం కాదని తాము చేస్తున్న పనిని గుర్తించాలని తెలిపారు. జిల్లా మెడికల్ ఆఫీసర్ అధ్యక్షుడు డాక్టర్ అనిల్, జిల్లా నాయకులు రాజిరెడ్డి, చందర్, బాలనర్సయ్య, విజయేందర్, సత్తమ్మ, మేరీ, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

తూప్రాన్, అక్టోబర్ 8 : హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)లో భూములు కోల్పోతున్న రైతులతో రెండో రోజు ఆర్డీవో జయచంద్రారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, నాగులపల్లి, వట్టూరు గ్రామాల్లో మొత్తం 36.04 హెక్టార్ల భూమికి సంబంధించిన రైతులకు భూ సేకరణ వివరాలను వెల్లడించారు. యాజమాన్య హక్కులను పరిశీలించి, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా తమ భూములకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లించాలని ఆర్డీవోను కోరారు.

వృత్తి విద్యా కోర్సుతో ఉపాధి అవకాశాలు

చేగుంట,అక్టోబర్ 8 : వృత్తి విద్యాకోర్సుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చేగుంట మోడల్ కళాశాల ఎల్క్ట్రికల్, హార్డ్‌వేర్ అధ్యాపకులు మధు అన్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని ప్రణయ్ కంప్యూటర్ సెంటర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ సహకారంతో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రణయ్ నెట్ సెంటర్ నిర్వాహకులు గాండ్ల పవన్‌కుమార్, ఒకేషనల్ అధ్యాపకుడు మధు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ : పలువురికి తీవ్ర గాయాలు

కౌడిపల్లి, అక్టోబర్ 8 : రెండు కార్లు ఢీకొని పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని మహ్మద్ నగర్ గేటు సమీపంలో మంగళవారం నాడు చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బోయిన్‌పల్లి అస్మాత్‌పేట గ్రామానికి చెందిన రాయిని చిదానంద్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఏడుపాయల వన దుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మహ్మద్ నగర్ గేటు సమీపంలో రాగానే నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న వయాగ్నార్ కార్లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తు న్న పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను వైద్య పరీక్షలు నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి : ఎస్పీ

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, అక్టోబర్ 8 : జన విజ్ఞాన వేదిక ద్వారా సమాజంలో శాస్త్ర దృక్పథంతో సంబంధం లేకుండా జరుగుతున్న మూఢనమ్మకాలను ఎదిరించి సామాన్య ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మూఢ నమ్మకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామాన్య ప్రజానీకంలో శాస్త్ర విజ్ఞాన ప్రచారం శాస్త్రీయ ఆలోచన దృక్పథం పెంపొందించడానికి కృషి చేయాలని మూఢ నమ్మకాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం చేసి అవగాహన సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో ఒకరి మృతి

రామాయంపేట, అక్టోబర్ 8 : బ్రెయిన్ ట్యూమర్‌తో బాధడుతూ చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృత్యువాత పడిన విషాధ సంఘటన హైదరాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని మంజీరా కాలనీలోలో నివాసముంటున్న మరింగంటి తిరుమలాచారి (55) కొన్ని నెలల కింద నీరసంగా ఉండడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సోమవారం రాత్రి కిమ్స్ దవాఖానలోనే చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో మృత్యువాత పడినట్లు కుటుంబీకులు తెలిపారు. దీంతో రామాయంపేట పట్టణంలో విషాధచాయలు అలుముకున్నాయి.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, అక్టోబర్ 8 : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుండె కరుణాకర్ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సంవత్సరం కింద కూతూరు వివాహానికి పలువురి వద్ద అప్పు చేశాడు. మంగళవారం భార్య కూలీ పనికి వెళ్లగా, కుమారుడు బయటకు వెళ్లడం చూసిన కరుణాకర్ ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కరుణాకర్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. గుండె కర్ణాకర్ మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎగ్జిట్ సౌకర్యం కల్పించాలి

హైవే అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

అల్లాదుర్గం, అక్టోబర్ 8 : 161 వ జాతీయ రహదారి అల్లాదుర్గం వద్ద ఎగ్జిట్ సౌకర్యం కల్పించాలంటూ మంగళవారం గ్రామస్తులు హైవే అధికారులను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు.161వ హైవే రహదారి నుంచి అల్లాదుర్గం గ్రామంలోకి వెళ్లాలంటే 6 కిలో మీటర్ల దూరం నుంచి సర్వీస్ రోడ్డు వెంబడి వెళ్లాల్సి వస్తుందన్నారు. అక్కడ దారి తప్పితే మరో 8కిలో మీటర్ల దూరంలో రాంపూర్ గ్రామం దాటిన తర్వాత తిరిగి రావల్సిన పరిస్థితి ఉందన్నారు.అల్లాదుర్గం వద్ద ఎగ్జిట్ పాయింట్ కల్పించేందుకు ఏడాది క్రితమే అనుమతులు వచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా హైవే అధికారులకు వినతి పత్రం అందజేశారు. నర్సింహారెడ్డి, బ్రహ్మం, బల్‌రాం, రాములు, సదానందం, నర్సింహులు, భూమేశ్, దుర్గయ్య, సాయిలు, తదితరులు ఉన్నారు.

రామాయంపేట : పర్వతాపూర్‌లో బతుకమ్మ ఆటలు ఆడుతున్న మహిళలు

చిన్నశంకరంపేట అంబాజిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చేగుంటలో బతుకమ్మను ఆడుతున్న మహిళలు,చిన్నారులు

ఊరూరా బతుకమ్మ వేడుకలు

టేక్మాల్, అక్టోబర్ 8 : తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ పండుగ. మహిళలు సంతోషంగా బతుకమ్మ వేడుకలను జరుపుకొంటారు. బతుకమ్మ పండుగ కోసం చెరువు వద్ద మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రమైన టేక్మాల్ చెరువు వద్ద విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేయలేదు. దీంతో చీకట్లోనే బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

రామాయంపేట ప్రభుత్వ సీహెచ్‌సీ దవాఖానలో బతుకమ్మ సంబురాలు

పెద్దశంకరంపేట : దుర్గమ్మ గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST

I, NEELI PRABHAKAR, S/o. NEELI RAMULU, R/o: H.No. 4-76/P/F-401/M, Jasmine Apartment, PNR Township, Indresham Patancheru (M), Sanga Reddy (Dist) T.S. Lost my Original Indian Passport while shifting house from Patancheru to H.No. 4-76/P/F-401/M, Jasmine Apartment, PNR Township, Indresham My Passport No. M033765. If anybody found please Contact: 7382814436

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331785-All